సాక్షి ఖమ్మం

శుక్రవారం : 28 : జూన్ : 2024



'సుడా'ను వదిలేశారా?!

స్తంభాద్రి డెవలప్‌మెంట్ అథారిటీ పాలకవర్గాన్ని రద్దుచేసి ఆరు నెలలు దాటినా కొత్త నియామకం జరగడం లేదు. 8లో



1.50లక్షల ఎకరాలకు..

సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా లక్షన్నర ఎకరాలకు సాగునీరు అందిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 25°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

ముంపుతో ముప్పు రావొద్దు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పక్కన మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ పాటిల్, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, వెంకట్రావు, ఆదినారాయణ, ఎమ్మెల్సీ మల్లన్న తదితరులు

ఒక్క ప్రాణ నష్టం జరగకుండా చూడాలి

- గోదావరి వరదలను సమర్థంగా ఎదుర్కోవాలి
- పటిష్ట ప్రణాళిక రూపొందించండి
- అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం

సూపర్‌బజార్(కొత్తగూడెం): వర్షాకాలంలో వచ్చే గోదావరి వరదలను సమర్థంగా ఎదుర్కొనేలా ముందే యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని, ఒక్క ప్రాణ నష్టం కూడా జరగడానికి వీల్లేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం ముందు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ముంపు వాసులు అనేక కష్టాలు అనుభవించారని అన్నారు. గోదావరి వరదలపై కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంతకుముందే ఈ సమావేశం నిర్వహించాల్సి ఉన్నా.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆలస్యమైందని తెలిపారు. వరద సహాయ చర్యలకు అవసరమైన మేర నిధులు విడుదల చేస్తామని, ముందుగానే కావాల్సిన సామగ్రి సమకూర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం సమస్యలను గాలికొదిలి ఏకపక్షంగా వ్యవహరించిందని విమర్శించారు. వరద బాధితులకు ఆహారం, పునరావాసం వంటి సౌకర్యాలు కల్పించడాన్ని సవాల్‌గా తీసుకుని కిందిస్థాయి ఉద్యోగి వరకు అంకిత భావంతో విధులు నిర్వహించాలని అన్నారు.

అందరూ అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. వరద సహాయ చర్యలకు, నివారణకు అవసరమైతే ఎమ్మెల్యే, డీఎంఎఫ్‌టీ నిధులు వాడుకోవాలని సూచించారు. ఈ మూడు నెలలు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆశ, అంగన్‌వాడీ, వైద్య బృందాలను గ్రామాలకు పంపాలని, డ్రెయినేజీ నీరు రోడ్లపైకి రాకుండా చూడాలని అన్నారు. గ్రామాల్లో కార్యదర్శుల పాలనే సాగుతోందని, ప్రజలకు అవసరమైన చర్యలు చేపట్టడంలో వారు ముందుండాలని సూచించారు. వరదలతో ఒక్క ప్రాణనష్టం కూడా లేకుండా చూడాలని కోరారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాసేవ అంటే శ్రీరాముడికి సేవ చేసినట్లేనని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. వరదలను సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికారులు, పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వరద నీటిని ఎత్తిపోసేందుకు ప్రస్తుతం ఉన్న మోటార్లు సరిపోకపోతే అదనంగా తెప్పించాలని, లాంచీలు సిద్ధంగా ఉంచాలని అన్నారు. విపత్తు వచ్చినపుడే మన సామర్థ్యం బయటపడుతుందని చెప్పారు.

'గూడెం'లో ఐటీ హబ్

- ఇకపై ఇంటింటికీ తాగునీరు
- జంటనగరాలను కార్పొరేషన్ చేస్తాం
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రుల హామీ



అమృత్ పథకానికి శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి, పొంగులేటి, తుమ్మల, ఎమ్మెల్యే కూనంనేని, భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ తదితరులు

కొత్తగూడెంఅర్బన్ : పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న కొత్తగూడెంలో ఐటీ హబ్ ఏర్పాటు చేస్తామని, ఈ మేరకు సింగరేణి యాజమాన్యంతో చర్చిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కొత్తగూడెంలో అమృత్ 2.0 పథకం ద్వారా మంజూరైన రూ. 124.48 కోట్లతో తాగునీటి పథకం పనులకు, డీఎంఎఫ్‌టీ నిధులతో నిర్మించే డ్రెయినేజీ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఇవ్వదని కొందరు ప్రచారం చేశారని, తాము ఒకేసారి రూ.7,500 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. ఆ శక్తులే ఇప్పుడు రైతు రుణమాఫీపై దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. ఇది ప్రజల ప్రభుత్వమని, రూ. 2 లక్షల రుణమాఫీ చేసి చూపిస్తామని, ఎన్ని ఆటంకాలు ఎదురైనా అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. రైతు భరోసా ఎవరికి ఇవ్వాలి, ఎలా పంపిణీ చేయాలనే దానిపై ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తామని తెలిపారు. రాష్ట్రంలో సంపద సృష్టిస్తామని, దాన్ని ప్రజలకు పంచుతామని చెప్పారు. గత పాలకులు మిషన్ భగీరథ పేరుతో రూ.42వేల కోట్ల అప్పు చేశారని, అయినా ఇంటింటికీ నీరు రాని గ్రామాలు ఇంకా అనేకం ఉన్నాయని చెప్పారు. నల్లగొండ జిల్లా ఆలేరు నియోజకవర్గంలో రూ.150 కోట్లు వెచ్చించి తాగునీరు అందించాల్సిన పరిస్థితి ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలను కలుపుతూ కార్పొరేషన్ ఏర్పాటుకు అవకాశం ఉంటే తప్పకుండా చేస్తానని హామీ ఇచ్చారు. కొత్తగూడెంలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి స్థల సేకరణ పూర్తయిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్వోబీల నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కృషి చేస్తున్నారని, అందులో కొత్తగూడెం కూడా ఉందని చెప్పారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. కొత్తగూడెం పట్టణంలో ఆరునెలల్లో ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తామని అన్నారు. బైపాస్ రోడ్ నిర్మాణ ఆవశ్యకత తను ఇటీవల కేంద్ర మంత్రి గడ్కరీకి వివరించామని, అది త్వరలోనే అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. రైతును రాజు చేస్తామని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అందరినీ కలుపుకొని సమన్వయంతో పని చేస్తామని వెల్ల డించారు. గత ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినా ఏ ఒక్క ఎకరానికీ నీరందించలేదని విమర్శించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలమయ్యేలా చూస్తామని చెప్పారు. సంవత్సర కాలంలోగా గోదావరి జలాలు భట్టి విక్రమార్క నియోజవకర్గానికి కూడా అందేలా చూస్తామన్నారు. అర్హులైన రైతులందరికీ మేలు జరిగేలా రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. భద్రాద్రి కొత్తగూడేన్ని పామాయిల్ జిల్లాగా మారుస్తామని చెప్పారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావ్, జారే ఆదినారాయణ, రాందాస్‌నాయక్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, జెడ్పీ చైర్మన్ కె.చంద్రశేఖర్, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్, ఎస్పీ రోహిత్‌రాజ్, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సభకు హాజరైన ప్రజలు

న్యూస్‌రీల్

స్పోర్ట్స్ స్కూళ్లలో ఎంపికకు నేటి నుంచి పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రంలోని స్పోర్ట్స్ స్కూళ్లలో నాలుగో తరగతిలో ప్రవేశాలు కల్పించేందుకు జిల్లా స్థాయి ఎంపిక పోటీలను ఈనెల 28, 29వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే మండల స్థాయి జరిగిన పోటీల్లో ఎంపికైన వారే కాక, పాల్గొనని వారు సైతం ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగే పోటీల్లో పాల్గొనవచ్చని వెల్లడించారు. ఈమేరకు వివిధ అంశాల్లో పోటీల్లో ఉంటాయని, విద్యార్థులు ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్, ప్రోగ్రెస్ కార్డు, పుట్టిన తేదీ, కుల ధ్రువీకరణపత్రాలతో పాటు ఐదు పాస్‌పోర్టు ఫొటోలతో ఉదయం 8గంటలకల్లా స్టేడియంకు చేరుకోవాలని సూచించారు.

వైరా కేవీకేకు పురస్కారాలు



అవార్డు అందుకుంటున్న వైరా కేవీకే కోఆర్డినేటర్ రవికుమార్

వైరా: రైతులకు అందిస్తున్న సేవలకు గాను వైరా కృషి విజ్ఞాన కేంద్రానికి నాలుగు పురస్కారాలు దక్కాయి. తెలంగాణ, ఏపీ, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల్లోని 72 కేవీకేల వార్షిక సమావేశం రాజమండ్రిలోని జాతీయ పొగాకు పరిశోధనా కేంద్రంలో ఈనెల 25 నుంచి గురువారం వరకు జరిగాయి. ఈ సందర్భంగా 2023–24 సంవత్సరానికి గాను ర్యాంకింగ్‌లు ఇవ్వగా వైరా కేవీకేకు నాలుగు అవార్డులు దక్కాయి. ఉత్పత్తి, రైతుల డేటాబేస్, రైతులకు వివిధ మాధ్యమాల ద్వారా వాతావరణ, నూతన సాంకేతిక, యాజమాన్య పద్ధతులపై సమాచారం ఇవ్వడమేకాక వెదజల్లే విధానంలో వరి సాగుపై రైతులకు అవగాహన కల్పించినందుకు గాను ఈ అవార్డులు ప్రకటించారు. ఈమేరకుఅటారీ జోన్–10 డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా, జాతీయ నూనె గింజల సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కే.మాథూర్ చేతుల మీదుగా వైరా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ పురస్కారాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డులకు ఎంపికయ్యేలా సహకరించిన వ్యవసాయ విశ్వ విద్యాలయం వీసీ రఘునందనరావు, డైరెక్టర్ వి.సుధారాణి, మధ్య తెలంగాణ మండలి అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఆర్.ఉమారెడ్డితో పాటు జిల్లా అధికారులు, రైతులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు మెగా జాబ్ మేళా

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని కూసుమంచి మండలం పాలేరులో శుక్రవారం నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సూచించారు. రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ, టీజీఎస్‌టీఈపీ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ఈ జాబమేళా పాలేరులోని బీ.వీ.రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 65 కంపెనీలు పాల్గొననుండగా 5వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారని చెప్పారు. నిరుద్యోగ యువత https://forms.gle/aWH1uo5posRrT3D6 లింక్ ద్వారా లేదా క్యూఆర్ కోడ్ ఆధారంగా దరఖాస్తు చేసుకుని హాజరు కావాలని, పూర్తి వివరాలకు 88867 11991, 96423 33668నంబర్లలో సంప్రదించాలని అదనపు కలెక్టర్ ఓ ప్రకటనలో సూచించారు.

క్యూఆర్ కోడ్

పోస్టల్ సూపరింటెండెంట్‌గా వీరభద్రస్వామి

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా వి.వీరభద్రస్వామిని నియమిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. ప్రస్తుతం ఆయన కర్ణాటక రాష్ట్రంలో విధులు నిర్వర్తిస్తుండగా ఖమ్మం బదిలీ చేశారు. ఇక్కడ సూపరింటెండెంట్‌గా ఉన్న బి.రవికుమార్‌ను వరంగల్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. ఈమేరకు రెండు, మూడు రోజుల్లో వీ.వీ.స్వామి బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం. కాగా, మూడేళ్లపాటు పాటు ఖమ్మం డివిజన్‌లో విధులు నిర్వర్తించిన రవికుమార్ శుక్రవారం రిలీవ్ కానుండగా అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

ఇద్దరికి ఎస్సైలుగా పదోన్నతి



ఖమ్మంక్రైం: జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ఏఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతి కల్పిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతి పొందిన వారిలో కె.సుబ్బారావు, విష్ణుమూర్తి ఉన్నారు. వీరిలో త్వరలో పోస్టింగ్ కేటాయించనున్నారు.

నేటి నుంచి సీపీఐ రాష్ట్రస్థాయి సమావేశాలు

- పదిహేనేళ్ల తర్వాత ఖమ్మంలో నిర్వహణ
- హాజరుకానున్న నారాయణ, అజీజ్‌పాషా, చాడ, కూనంనేని

ఖమ్మంమయూరిసెంటర్: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)రాష్ట్రస్థాయి సమావేశాలు శుక్రవారం ఖమ్మంలో ప్రారంభం కానున్నాయి. 2009 నవంబర్‌లో ఇక్కడ రాష్ట్ర స్థాయి సమావేశాలు జరగగా, మళ్లీ పదిహేనేళ్ల తర్వాత నిర్వహిస్తుండడంతో జిల్లా సమితి ఆధ్వర్యాన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర కార్యదర్శి వర్గ సమావేశం, కార్యవర్గ సమావేశాలు జరుగుతాయని నాయకులు తెలిపారు. ఇక పార్టీ రాష్ట్ర సమితి సమావేశాలు ఖమ్మంలోని ఆర్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శని, ఆదివారం జరగనున్నాయి. ఈ సమావేశాలకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యులు అజీజ్‌పాషా, చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు హాజరుకానున్నారు. ఈసందర్భంగా గత కార్యక్రమాలను సమీక్షించుకోవడంతో పాటు భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. సింగరేణి ప్రైవేటీకరణకు జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకునేలా ఆందోళనలకు కార్యకర్తలను సన్నద్ధం చేయడమే కాక బీజేపీ మతోన్మాద వైఖరిపై ప్రజల్లో చైతన్యం కల్పించడం, అట్టడుగు వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాల్సిన ఆవశ్యకతపై చర్చిస్తామని నాయకులు తెలిపారు. కాగా, సభల నిర్వహణకు పార్టీ నాయకులు భాగం హేమంతరావు, పోటు ప్రసాద్, మహ్మద్ మౌలానా, దండి సురేష్ తదితరుల నేతృత్వాన ఏర్పాట్లను పూర్తి చేయగా, జిల్లా కేంద్రంలోని ముఖ్యకూడళ్లను ఎర్ర జెండాలు, తోరణాలతో అలంకరించారు.

సుందరం.. సుమనోహరం..

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు



జీలుగు పంటలో డీఏఓ విజయనిర్మల, తదితరులు

ఈ ఫొటోలో కనిపిస్తున్నది జీలుగు పంట. పచ్చి రొట్ట సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం విత్తనాలను సబ్సిడీపై అందజేస్తోంది. వీటిని తీసుకుని రైతులు సాగు చేసిన పంటలను జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల గురువారం పరిశీలించారు. కొణిజర్ల మండలం సింగరాయపాలెం తదితర గ్రామాల్లో పచ్చిరొట్ట సాగును పరిశీలించిన ఆమె లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం డీఏఓ గ్రామాల్లో పంటల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ఏఈఓలతో మాట్లాడి శుక్రవారం సాయంత్రానికి పూర్తి చేయాలని ఆదేశించారు. తద్వారా రైతులకు ప్రభుత్వం నుంచి సబ్సిడీలు, సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. అనంతరం తీగలబంజరలో ఆయిల్‌పామ్ తోటలో సాగు చేసిన అంతర పంటలను పరిశీలించడమే కాక కొణిజర్లలో పత్తి కలుపు తీస్తున్న కూలీలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఏఓ డి.బాలాజీ, ఏఈఓ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు. – కొణిజర్ల

వేగంగా 'ధరణి' దరఖాస్తుల పరిష్కారం

అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్




దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచినట్లు అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన ఉద్యోగులతో కలిసి దరఖాస్తుల పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రోజువారీ లక్ష్యాన్ని ఎంచుకుని దరఖాస్తులను పరిష్కరిస్తున్నామని తెలిపారు. తహసీల్దార్లు, ఆర్డీఓల లాగిన్‌లో ఉన్న ఫైళ్లను త్వరగా పరిశీలించేలా ఆదేశించామని, అక్కడి నుంచి తమకు చేరగానే పరిశీలించి కలెక్టర్‌కు పంపిస్తున్నామని వివరించారు.

823మంది నుంచి రూ.9.57కోట్లు సేకరణ

- మనీ సర్క్యులేషన్ స్కీం పేరిట మోసం
- ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసిన నేలకొండపల్లి పోలీసులు
- ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ సహా పలు జిల్లాల్లో బాధితులు



నేలకొండపల్లి: తేలికగా డబ్బు సంపాదించాలనే ఆశతో గుర్తుతెలియని వ్యక్తులు పంపే మెసేజ్‌లను నమ్మి పలువురు మోసపోతున్నారు. దీనిని ఆసరాగా తీసుకున్న ముగ్గురు వ్యక్తులు మనీ సర్క్యులేషన్ స్కీంను ప్రారంభించి రూ.9కోట్లకు పైగా దండుకున్నారు. ఇందులో కొందరికి చెల్లించినా మిగతా వారిని మోసం చేయడంతో బాధితుల ఫిర్యాదు మేరకు ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించి నేలకొండపల్లి ఎస్సై టి.నాగరాజు గురువారం రాత్రి వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.

నేలకొండపల్లి మండలం మంగాపురంతండాకు చెందిన భూక్యా వీరన్న ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా, సునాయాసంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో మనీ సర్క్యులేషన్ స్కీంకు తెర లేపాడు. హైదరాబాద్ కు చెందిన ఉమ్మనేని రాఘవరావు సాయంతో కొలగాని రామకోటేశ్వరరావు ద్వారా సాఫ్ట్‌వేర్ తయారుచేయించుకుని గత సంవత్సరం జూన్, ఈ ఏడాది ఫిబ్రవరిలో వెబ్ లింక్‌ల ద్వారా స్కీమ్ ప్రారంభించారు. ఇందులో భాగంగా ఈ నెల వరకు ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలు సహా పలు జిల్లాల్లో 823 మంది నుంచి రూ.9,57,90,308 మేర సేకరించగా.. తొలినాళ్లలో పలువురికి సక్రమంగానే డబ్బు చెల్లించారు. ఆతర్వాత ముఖం చాటేస్తుండడంతో నేలకొండపల్లి మండలం చెన్నారానికి చెందిన మానుకొండ రామారావు ఈనెల 23న ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు వీరన్నను అదుపులోకి తీసుకుని విచారించగా వ్యవహారం బయటపడింది. ఆయనతో పాటు ఏపీలోని ప్రకాశం జిల్లా దొనుకొండ కు చెందిన ఉమ్మనేని రాఘవరావు, గుంటూరు జిల్లా నాదెండ్ల మండలం తూబాడుకు చెందిన కొలగాని రామకోటేశ్వరరావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

సరఫరా మరింత మెరుగయ్యేలా...

- కొత్త విద్యుత్ సెక్షన్ల ఏర్పాటుకు కసరత్తు
- 10 వేల కనెక్షన్లకు ఒక సెక్షన్ ఉండేలా ప్రణాళిక
- ప్రతిపాదనలు రూపొందిస్తున్న జిల్లా యంత్రాంగం
- ఇప్పటికే మూడింటి ఏర్పాటుకు సూత్రప్రాయంగా నిర్ణయం



ఖమ్మంవ్యవసాయం: వినియోగదారులకు మెరుగైన సేవలందించడంతో పాటు విద్యుత్ సరఫరాలో అవాంతరాలు ఎదురుకాకుండా చూసేందుకు టీజీఎస్పీడీసీఎల్ కసరత్తు చేస్తోంది. నానాటికీ కొత్త గృహాల నిర్మాణంతో కనెక్షన్ల సంఖ్య పెరుగుతోంది. దీంతో పెరిగిన విద్యుత్ వినియోగం, కనెక్షన్లకు అనుగుణంగా సేవలందించేలా నూతన సెక్షన్ ఏర్పాటుకు సిద్ధమయ్యారు. ఎక్కువ కనెక్షన్లు ఉన్న సెక్షన్లను విభజించి వీటిని ఏర్పాటుచేయనుండగా... టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యాలయం నుంచి అందిన ఆదేశాలతో జిల్లా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఈ విషయమై జిల్లాలోని ఖమ్మం టౌన్, ఖమ్మం రూరల్, వైరా, సత్తుపల్లి డివిజన్ల అధికారులతో సమావేశమై చర్చించారు. నాలుగేళ్ల క్రితం జిల్లాలో పెద్దగోపతి, రాజేశ్వరపురం, పమ్మి, ఆరెంపుల, ఖమ్మం నగరంలో టౌన్–4, టౌన్–5 సెక్షన్లను ఏర్పాటు చేయగా.. మరోసారి కొత్త సెక్షన్లు ఏర్పాటుకానున్నాయి.

కనెక్షన్ల సంఖ్య, దూరం ఆధారంగా..

పది వేల కనెక్షన్లకు ఓ సెక్షన్ ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈమేరకు ఆయా కనెక్షన్ల కేంద్ర బిందువును గుర్తించి కొత్త సెక్షన్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తుండగా... దూరాన్ని కూడా పరిగణనలోకి తీసుకోనున్నారు. జిల్లాలో గృహ, వ్యవసాయ, వాణిజ్య తదితర కేటగిరీలకు చెందిన సర్వీసులు సుమారు 6.25 లక్షల వరకు ఉండగా, 45 సెక్షన్లు కొనసాగుతున్నాయి. ఉన్నతాధికారుల నిర్ణయంతో కొత్త సెక్షన్లు ఏర్పాటు కానుండగా వినియోగదారులు ఫిర్యాదు చేసేందుకు, ఇతర అంశాలపై దూరం వెళ్లాల్సిన ఇక్కట్లు తప్పుతాయి. అంతేకాకుండా మెరుగైన విద్యుత్ సరఫరా సాధ్యమవుతుందని భావిస్తున్నారు. కారేపల్లి, కామేపల్లి, తిరుమలాయపాలెం, బోనకల్, ముదిగొండ తదితర మండలాల్లో వినియోగదారులకు దూరంగా సెక్షన్ కార్యాలయాలు ఉండడంతో కొత్తవి ఏర్పాటైతే ఆయా సెక్షన్ల పరిధిలోని వినియోగదారుల ఇబ్బందులు తీరుతాయని భావిస్తున్నారు.

ఉద్యోగులు, సిబ్బంది సర్దుబాటు

జిల్లాలో కొత్త సెక్షన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే ఏన్కూరు, కొత్తలింగాల నుంచి పలు ప్రాంతాలను విడదీసి తిమ్మారావుపేట, కామేపల్లి సెక్షన్లను, ఇంకొన్ని ప్రాంతాల నుంచి వీడదీస్తూ మోటమర్రి సెక్షన్ ఏర్పాటుకు ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. కాగా, ఒక్కో సెక్షన్‌లో అసిస్టెంట్ ఇంజనీర్, సబ్ ఇంజనీర్, ఫోర్‌మెన్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్ ఇన్‌స్పెక్టర్, ముగ్గురు లైన్‌మెన్లు, నలుగురు జేఎల్‌ఎంలతో పాటు అన్‌మ్యాన్ కార్మికులు ఉండాలి. అయితే కొత్త సెక్షన్ల ఏర్పాటైనా కొన్నాళ్ల పాటు ప్రస్తుతం ఉన్న ఉద్యోగులనే సర్దుబాటు చేస్తారని తెలిసింది.

ప్రతిపాదనలు రూపొందిస్తున్నాం..

వినియోగదారులకు మెరుగైన సేవల కోసం నూతన సెక్షన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉద్యోగులతో సమీక్షించడమే కాక కనెక్షన్ల సంఖ్య, దూరాభారాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నాం. త్వరలోనే ఈ అంశం ఓ కొలిక్కి రానుంది.
– ఏ.సురేందర్, ఎస్‌ఈ, ఎస్పీడీసీఎల్ ఖమ్మం సర్కిల్

క్లుప్తంగా

అసంపూర్తి పనులపై జెడ్పీ సీఈఓ అసహనం



వేంసూరులో పనులపై ఆరా తీస్తున్న సీఈఓ

వేంసూరు/పెనుబల్లి: వేంసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరమ్మతు పనులను జెడ్పీ సీఈఓ ఎస్.వినోద్ గురువారం పరిశీలించారు. పీహెచ్‌సీలో చేపట్టాల్సిన పనులకు గతంలో రూ.15 లక్షలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా పరిశీలించిన క్రమంలో శ్లాబ్‌పై నుంచి చెమ్మదిగడం, బాత్‌రూమ్ గదులు అంపూర్తిగా ఉండడాన్ని గుర్తించిన సీఈఓ అసహనం వ్యక్తం చేశారు. ఈమేరకు పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ రమేష్, మండల వైద్యాధికారి ఇందుప్రియాంక, ఎంపీఓలు రంజిజ్‌కుమార్, వెంకటనారాయణ పాల్గొన్నారు. ఇక పెనుబల్లి మండల పరిషత్ కార్యాలయం, లంకాసాగర్ పీహెచ్‌సీని కూడా సీఈఓ తనిఖీ చేసి పెండింగ్ పనుల పూర్తి, ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలనపై సూచనలు చేశారు.

మైనర్ల డ్రైవింగ్‌తో అనర్థాలపై అవగాహన



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు

ఖమ్మంక్రైం: ట్రాఫిక్, రహదారి నిబంధనలపై అవగాహన లేని మైనర్లు వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు. జిల్లా కేంద్రంలో ఇటీవల చేపడుతున్న తనిఖీల్లో మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడుతున్నారు. దీంతో ప్రత్యేక దృష్టి సారించిన ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఖమ్మంలోని రిక్కాబజార్ పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలపై అవగాహన నిర్వహించారు. తనిఖీల్లో పట్టుబడితే డ్రైవింగ్ చేసే వారిపైనే కాక వాహనం ఇచ్చిన యజమానులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈకార్యక్రమంలో సీఐ మోహన్ బాబు, ఎస్ఐలు రవి, సాగర్ పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్లను పునరుద్ధరించాలని తీర్పు

ఖమ్మం లీగల్: బిల్లు చెల్లించినప్పటికీ కనెక్షన్ తొలగించిన వినియోగదారులను మనోవేదనకు గురిచేసినందుకు గాను పరిహారం చెల్లించడమే కాక వెంటనే కనెక్షన్లను పునరుద్ధరించాలంటూ ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చైర్మన్ వి.లలిత, సభ్యురాలు ఏ.మాధవీలత గురువారం తీర్పు నిచ్చారు. కేసు వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం దోరేపల్లి పుల్లయ్య నగర్‌కు చెందిన కైలాసపు ఉపేంద్రమ్మ, కమలమ్మ 2014లో తమ గృహాలకు విద్యుత్ మీటర్లు తీసుకొన్నా రు. ఈమేరకు బిల్లు చెల్లించినా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సిబ్బంది సరఫరా నిలిపివేయడంతో కార్యాలయంలో ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించారు. దీంతో కేసును పరిశీలించిన కమిషన్ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ఉందని నిర్ధారించి రూ.15వేల చొప్పున పరిహారం, కోర్టు ఖర్చుల నిమిత్తం మరో రూ.5వేలు చెల్లించడమేకాక సర్వీసులు పునరుద్ధరించాలని తీర్పు చెప్పారు. కాగా, ఫిర్యాదుదారుల తరఫున న్యాయవాదిగా కొప్పుల రవికుమార్ వ్యవహరించారు.

భూగర్భ గనుల నుంచి సర్ఫేస్‌కు అవకాశం

అర్హులైన ఓవర్‌మెన్లు దరఖాస్తు చేసుకోవాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలోని భూగర్భ గనుల్లో పనిచేస్తున్న హెచ్‌ఓఎం/ ఓవర్‌మెన్లు సర్ఫేస్‌లోని ఓపెన్‌కాస్ట్ గనుల్లో పనిచేసేందుకు అవకాశం కల్పిస్తూ గురువారం యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఆసక్తి ఉన్న కార్మికులు దరఖాస్తు చేసుకోవాలని కోరింది. సింగరేణి వ్యాప్తంగా ఉన్న 18 ఓపెన్ కాస్ట్ గనుల్లో ఖాళీలను గుర్తించి, కౌన్సెలింగ్ నిర్వహించి, సీనియారిటీ ప్రకారం బదిలీ చేస్తామని పేర్కొంది. సర్క్యులర్‌లో ఇచ్చిన ఫార్మాట్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, గతంలో చేసుకున్న దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబోమని తెలిపింది.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,560	5,500
కందులు	10,250	8,000
అలసంద	8,350	8,350
మిర్చి	18,800	10,000
మిర్చి తాలు	10,200	7,500
ఏసీ మిర్చి	20,000	14,500
ఏసీ తాలు	10,800	9,000
పత్తి	7,250	5,700

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,438

'సుడా'ను వదిలేశారా?!

- డిసెంబర్‌లో రద్దయిన పాలకవర్గం
- నాటి నుండి కొరవడుతున్న పర్యవేక్షణ
- మాస్టర్ ప్లాన్‌లో కదలిక లేక ఇష్టారాజ్యంగా వెంచర్ల ఏర్పాటు
- భవనాల నిర్మాణంలో నిబంధనలు పాటించని యజమానులు



స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) కార్యాలయం

ఖమ్మంమయూరిసెంటర్: పట్టణ ప్రాంతాభివృద్ధిలో భాగంగా గత ప్రభుత్వం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు తోడు సమీపాన మండలాలు, గ్రామాలను కలుపుతూ స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా)ను ఏర్పాటు చేసింది. ఆపై పాలకవర్గాన్ని సైతం నియమించింది. ఈ పాలకవర్గం ఆధ్వర్యంలో వెంచర్ల ఏర్పాటుకు అనుమతులు, నిర్మాణాల అనుమతులను మంజూరు చేశారు. ఇంతలోనే ప్రభుత్వం మారగానే గతేడాది డిసెంబర్‌లో సుడా పాలకవర్గాన్ని రద్దు చేశారు. ఆతర్వాత మళ్లీ భర్తీ చేయకపోవడంతో సుడా పరిధిలో అభివృద్ధి పనులు, అనుమతులపై పర్యవేక్షణ కొరవడింది.

2017లో ఏర్పాటు..

స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పడ్డాక ఖమ్మం నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల అభివృద్ధిలో వేగం పెరిగింది. 2017 అక్టోబర్ 24న గత ప్రభుత్వం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు వైరా మున్సిపాలిటీ, కూసుమంచి, ఖమ్మం రూరల్, ముదిగొండ, చింతకాని, కొణిజర్ల, రఘునాథపాలెం మండలాల్లోని 46 గ్రామపంచాయతీలను కలిపి 573 చదరపు కిలోమీటర్ల వైశాల్యంతో సుడాను ఏర్పాటుచేసింది. నాటి నుంచి ఈ పరిధిలో జరిగే అభివృద్ధి పనులతో పాటు నిర్మాణాలు, వెంచర్ల ఏర్పాటును సుడా పర్యవేక్షిస్తోంది.

కొత్త ప్రభుత్వం రాగానే రద్దు

సుడా ఏర్పాటయ్యాక 2020 జూన్‌లో పాలకవర్గాన్ని నియమించారు. గతేడాది డిసెంబర్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడగానే సుడా పాలకవర్గాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో చైర్మన్‌తో పాటు 14 మంది డైరెక్టర్లను పదవుల నుండి తొలగించారు. ఇదంతా పక్కన పెడితే ఆరు నెలలు దాటుతున్నా కొత్త పాలకవర్గాన్ని ప్రభుత్వం నియమించలేదు. దీంతో సుడా కార్యకలాపాలన్నింటినీ వైస్ చైర్మన్‌గా ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పర్యవేక్షిస్తున్నారు. పనిభారంతో రెండింటిని పర్యవేక్షించడం ఇబ్బందిగా మారిందని తెలుస్తుండగా.. సుడాకు పూర్తి స్థాయిలో ఉద్యోగులను నియమించకపోవడంతో కేఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులే చక్కబెట్టాల్సి వస్తోంది.

అభివృద్ధికి ఆటంకం

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు సుడాకు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు డ్రాఫ్ట్ సిద్ధం చేసి పలుమార్లు అభిప్రాయాలు సేకరించినా ఆమోదం తెలపలేదు. దీంతో ప్లాన్ మధ్యలోనే నిలిచిపోయింది. ఫలితంగా పాత ప్రణాళికలతోనే వెంచర్ల ఏర్పాటు, అభివృద్ధి నిర్మాణాలు, భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ కారణంగా భవిష్యత్‌లో జరిగే అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుందనే చర్చ జరుగుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు.

వాయిదాలతోనే..

సుడా మాస్టర్ ప్లాన్ తయారీ నాలుగేళ్లుగా కొనసాగుతోంది. సుడా ఏర్పడక ముందే మాస్టర్ ప్లాన్ తెరపైకి వచ్చినా పలుమార్లు వాయిదా పడింది. ఆతర్వాత ప్లాన్ ముసాయిదా సిద్ధం చేసినా వివిధ కారణాలతో అడుగు ముందుకు పడలేదు. 2020 ఏడాదిలో ప్లాన్ తయారీ ఓ కొలిక్కి రాగా, 2021లో పలుమార్లు సమీక్షలు నిర్వహించారు. ఇక ప్రభుత్వం మారాక మొదటిసారి కేఎంసీ కార్యాలయానికి వచ్చిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాస్టర్ ప్లాన్‌లో పలు మార్పులు సూచించి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అయినప్పటికీ ఎలాంటి కదలిక లేకపోవడం గమనార్హం. అయితే, కొత్త పాలకవర్గం ఏర్పాటైతే తప్ప మాస్టర్ ప్లాన్‌లో కదలిక వచ్చే అవకాశం లేదనే చర్చ జరుగుతోంది.

1.50లక్షల ఎకరాలకు గోదావరి జలాలు

- సీతారామ ద్వారా ఈ ఖరీఫ్‌లోనే అందిస్తాం
- భూనిర్వాసితులు, అధికారులకు, ఇంజనీర్లకు పాదాభివందనాలు
- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



గోదావరి జలాలకు నమస్కరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అశ్వాపురం: సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా ఈ ఖరీఫ్‌లోనే ఏన్కూరు లింక్ కెనాల్ మీదుగా లక్షన్నర ఎకరాలకు గోదావరి జలాలు అందిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని బీజీకొత్తూరులో సీతారామ ఎత్తిపోతల పథకం ఫేస్ -1 పంప్‌హౌస్‌ను గురువారం ట్రయల్ రన్ చేసి నీరు ఎత్తిపోశారు. గోదావరి జలాలకు మంత్రి తుమ్మల పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ట్రయల్‌రన్ సక్సెస్‌కు కృషి చేసిన ఇరిగేషన్ సలహాదారుడు పెంటారెడ్డి, సీఈ శ్రీనివాసరెడ్డి, అధికారులు, ఇంజనీర్లతో పాటు భూములు ఇచ్చిన రైతులకు పాదాభివందనాలు తెలుపుతున్నానని అన్నారు. గోదావరి జలాలు ఉమ్మడి జిల్లా భూభాగాన్ని తాకాలనే ప్రజల చిరకాల వాంఛ త్వరలో నెరవేరబోతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి భద్రాచలం వచ్చినప్పుడు సీతారామ ప్రాజెక్ట్‌కు కొన్ని నిధులు ఇస్తే మూడు పంప్‌హౌస్‌లు, కెనాల్ పూర్తవుతాయని విన్నవించగా వెంటనే నిధులు మంజూరు చేశారని, ఎలక్ట్రిసిటీ బోర్డుకు, పెండింగ్ బిల్లులకు నిధులు చెల్లించారని తెలిపారు. సీఈ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అధికారులు, ఇంజనీర్లు నిరంతరం శ్రమించారని అభినందించారు. ఆగస్టు నెలాఖరుకు ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా వైరా ప్రాజెక్ట్, లంకాసాగర్ ప్రాజెక్ట్ ద్వారా సాగర్ ఆయకట్టు కాకుండా మిగిలిన చెరువులన్నీ నింపే పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జలవనరుల శాఖ సలహాదారు పెంటారెడ్డి, సీఈ శ్రీనివాసరెడ్డి, ఎస్ఈలు శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ శ్రీనివాస్, ఏఈ రమేష్, మేఘ సంస్థ జీఎం శ్రీనివాసరావు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఎంపీపీ ముత్తినేని సుజాత, ఎంపీటీసీ కమటం నరేష్, మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీటీపీఎస్‌కు బూడిద కష్టాలు



సాంబయ్యగూడెం వద్ద గోదావరిలో కలుస్తున్న బూడిద నీరు

- చెరువులు నిండడంతో కానరాని ప్రత్యామ్నాయం
- ఫలించని కొత్త మార్గాల అన్వేషణ
- నేరుగా గోదావరిలోకి చేరుతున్న బూడిద
- నదీ జలాలు కలుషితమవుతున్నా పట్టించుకోని అధికారులు

పినపాక: మణుగూరు - పినపాక మండలాల సరిహద్దులో చిక్కుడుగుంట గ్రామం వద్ద ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన భద్రాద్రి పవర్ ప్లాంట్‌లో రోజుకో కొత్త సమస్య ఎదురవుతోంది. అధికారులు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో సమీప గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పవర్ ప్లాంట్ ద్వారా వెలువడే బూడిద, దుమ్ము చుట్టుపక్కల ఇళ్లు, పొలాలపై పడుతుండడంతో స్థానికులు, రైతులకు తిప్పలు తప్పడం లేదు. దీనికి తోడు బూడిద తరలింపు అంశం పరిష్కారానికి నోచుకోవడం లేదు.

బూడిద చెరువులు ఫుల్

పవర్ ప్లాంట్‌లో బొగ్గు మండించాక వెలువడే బూడిదను కొంత భాగం పైపుల ద్వారా చెరువులకు తరలిస్తారు. ఇంకొంత లారీల్లో నింపి ఇటుక బట్టీలు, సిమెంట్ ఫ్యాక్టరీలకు పంపిస్తుంటారు. అయితే, ప్లాంట్‌లో ఏర్పాటుచేసిన యంత్రాల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం, అవలంబిస్తున్న విధానాలు సైతం పాతవి కావడంతో పైపులకు బూడిద అంటుకుపోయి లారీలకు తక్కువ శాతం లోడింగ్ చేస్తున్నారు. మిగతాదంతా నీటి ద్వారా బూడిద చెరువుకు తరలిస్తున్నారు. ఇదే సింహభాగం కావడంతో ప్లాంట్ ఏర్పాటు సమయాన నిర్మించిన రెండు బూడిద చెరువులు నిండిపోయాయి. ప్రత్యామ్నాయ మార్గాలు లేకపోవడంతో ఉన్న ఆ చెరువుల కట్టలను ఎర్ర మట్టి ద్వారా ఎత్తు పెంచుతూ నింపుతున్నారు.

ఇప్పుడు గోదావరిలోకి...

పవర్ ప్లాంట్ ద్వారా వెలువడే బూడిద ఎక్కువ భాగం గొట్టాలకు అంటుకుపోతుండగా.. నీటి ద్వారా చెరువులకు పంపిస్తున్నారు. ఇప్పుడు చెరువులు నిండడంతో అక్కడి నుండి కాల్వ ద్వారా పక్కనే ఉన్న గోదావరిలోకి బూడిద నీరు తరలిస్తున్నారు. తద్వారా స్వచ్ఛమైన గోదావరి జలాలు కలుషితం అవుతున్నాయి. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ నీటినే తాగు, సాగునీటి అవసరాలకు ఉపయోగిస్తున్నారు. నీరు కలుషితం అవుతుండడంతో తాగుతున్న ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. అంతేకాక భద్రాద్రి పవర్ ప్లాంట్ నుంచి వెలువడే బూడిద పంట పొలాలపై పడడంతో దిగుబడి తగ్గుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారుల స్పందించి శాశ్వత ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పొలాలు దెబ్బతింటున్నాయి..

పవర్ ప్లాంట్ నుంచి వెలువడే బూడిద పొలాలపై పడడంతో పంట దిగుబడి తగ్గుతోంది. అంతేకాక గోదావరిలోకి బూడిద నీరు కలవడంతో జలాలు కలుషితమవుతున్నాయి అధికారులు స్పందించి గోదావరిలోకి బూడిద నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలి. – టి.జయరాజ్, చిక్కుడుగుంట

అనారోగ్యం పాలవుతున్నాం..

చెరువుల్లో నిండిన బూడిద నీటిని పక్కనే ఉన్న కాల్వ ద్వారా గోదావరిలోకి పంపిస్తున్నారు. తద్వారా గోదావరి జలాలతో పాటు బోర్ల నీరు సైతం కలుషితమవుతోంది. ఈ నీటిని తాగుతున్న పిల్లలకు చర్మవ్యాధులు, దగ్గు వంటి అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. – భీమరాజు, సీతారాంపురం

ఆరుగురికి హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి

ఖమ్మంక్రైం: ఉమ్మడి జిల్లాలోని వివిధ స్టేషన్లలో పనిచేస్తున్న ఆరుగురు కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించింది. ఈమేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఖమ్మం జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న కొండం రాజు, ఎం.నాగేశ్వరరావు, డి.శ్రీనివాస్, వై.రాములు. వి.లక్ష్మీపతి, భద్రాది కొత్తగూడెం జిల్లాలో పనిచేస్తున్న సీహెచ్.రాంబాబుకు పదోన్నతి లభించగా, భద్రాది కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు కేటాయించారు.

విద్యుత్ బిల్లుల్లో గోల్‌మాల్

రూ. 80వేలు స్వాహా చేసిన ఉద్యోగిపై వేటు

ఖమ్మంవ్యవసాయం: ఎస్సీ, ఎస్టీలకు చెందిన ఉచిత విద్యుత్ బిల్లులను స్వాహా చేసినట్లు తేలడంతో కూసుమంచి విద్యుత్ రెవెన్యూ సెక్షన్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ బి.మాధవరావును సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు 101 యూనిట్ల మేర ఉచిత విద్యుత్ సమకూరుస్తుండగా, వినియోగదారులు చెల్లించిన బిల్లులను తిరిగి ఆయా కార్పొరేషన్ల ద్వారా విద్యుత్ శాఖకు జమ చేస్తారు. ఈక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మాధవరావు అనర్హులకు లబ్ధి జరిగేలా చూస్తూ, లబ్ధిదారులు చెల్లించిన రూ.80వేలు వేలను సొంతానికి వాడుకున్నట్లు గుర్తించారు. దీంతో విచారణ చేయించిన ఉన్నతాధికారులు ఖమ్మం ఎస్ఈ ఏ.సురేందర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా మాధవరావును సస్పెండ్ చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, మాధవరావు ఖమ్మం రూరల్ మండలంలో విధులు నిర్వర్తించిన సమయాన ఓసారి సస్పెన్షన్‌కు గురికాగా.. త్వరలో ఉద్యోగ విరమణ చేయనున్న ఆయనపై మళ్లీ సస్పెన్షన్ వేటు పడడం గమనార్హం.

కరకట్ట నిర్మాణంలో వేగం పెరగాలి..

క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ దేవేందర్‌రెడ్డి



కరకట్ట నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ, అధికారులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగరంతో పాటు ఖమ్మం రూరల్ మండలంలోని వివిధ గ్రామాలకు మున్నేరు వరద తాకిడి నుండి రక్షణ కల్పించేందుకు చేపడుతున్న కరకట్ట నిర్మాణంలో వేగం పెంచాలని క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ దేవందర్‌రెడ్డి సూచించారు. జలవనరులశాఖ ఆధ్వర్యాన రూ.690కోట్లతో చేపట్టిన కరకట్ట నిర్మాణ పనులను గురువారం ఆయన ఇంజనీర్ల బృందంతో కలిసి పరిశీలించారు. ఇప్పటి వరకు జరిగిన పనులపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే పనుల్లో మరింత వేగం పెంచాలని ఆదేశించారు. అలాగే, కరకట్ట డిజైన్ మ్యాప్‌లను పరిశీలించి పలు మార్పులు చేసినట్లు తెలిసింది. కాగా, వర్షాలు ఇంకా ఊపందుకోనందున ఆలోగా పనులు చకచకా చేయాలని తెలిపారు. ఇదే సమయాన నాణ్యత విషయంలో జాగ్రత్తలు పాటించాలని ఎస్ఈ చెప్పారు. జలవనరులశాఖ పాలేరు ఈఈ మంగళపుడి వెంకటేశ్వర్లు, క్వాలిటీ కంట్రోల్ ఈఈ వెంకటరమణ, డీఈలు రమేష్‌రెడ్డి, మన్మధరావు, చంద్రశేఖర్, ఏఈలు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధం వద్దన్నందుకు ఇంటికి నిప్పు

రఘునాథపాలెం: కొంతకాలం కొనసాగిన వివాహేతర సంబంధాన్ని మహిళ వద్దని చెప్పడంతో కోపం పెంచుకున్న వ్యక్తి ఆమె ఇంటికి నిప్పు పెట్టాడు. పోలీసుల కథనం ప్రకారం.. రఘునాథపాలెం మండలం పువ్వాడనగర్‌లో నివాసముంటున్న వివాహిత తన భర్తతో 2013లో విడాకులు తీసుకుంది. ఆతర్వాత ఖమ్మం మామిళ్లగూడెంకు చెందిన జె.ఉపేందర్ ఆమెతో వివాహేతర సంబంధం ఏర్పర్చుకుని సహజీవనం చేస్తున్నాడు. అయితే, ఆయనపై రౌడీషీట్ ఉందని తెలియడంతో సదరు మహిళ కొన్నాళ్లుగా దూరం పెడుతోంది. దీంతో కోపం పెంచుకున్న ఉపేందర్ గురువారం ఆమె ఇంటికి నిప్పు పెట్టాడు. ఈమేరకు సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ ఉద్యోగులు చేరుకునే లోగా రూ.లక్ష విలువైన సామగ్రి కాలిపోవడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కత్తులతో బెదిరించి ఆభరణాలు చోరీ



తిరుమలాయపాలెంలో చోరీపై విచారిస్తున్న ఎస్ఐ గిరిధర్‌రెడ్డి

తిరుమలాయపాలెం: పంట చేను వద్దకు వెళ్లిన ఓ వ్యక్తిని పట్టపగలే గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు కత్తులతో బెదిరించి మూడు తులాల బంగారు గొలుసు, ఉంగరం లాక్కెళ్లిన ఘటన తిరుమలాయపాలెంలో గురువారం చోటుచేసుకుంది. తిరుమలాయపాలెంకు చెందిన కొండబాల బాబురావు మధ్యాహ్నం మోటార్ సైకిల్‌పై తన చేనులో ఆయిల్‌పామ్ చెట్లకు నీళ్లుపట్టేందుకు వెళ్లి వస్తున్నాడు. ఆ సమయాన చెట్ల పొదల్లో దాక్కున్న ఇద్దరు వ్యక్తులు ముఖం కనిపించకుండా గుడ్డలు కట్టుకుని వచ్చారు. బాబురావును వారు కత్తులతో బెదిరించి బంగారు గొలుసు, ఉంగరం తీసుకోవడమే కాక సెల్‌ఫోన్ సైతం లాక్కున్నారు. దీంతో ఆయన కేకలు వేస్తుండగా వారు సెల్‌ఫోన్ వదిలేసి పారిపోయారు. ఈమేరకు సమాచారం అందుకున్న ఎస్సై గిరిధర్‌రెడ్డి చేరుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

గంగమ్మ ఆలయంలో...

కూసుమంచి: కూసుమంచిలోని శివాలయం సమీపాన ఉన్న గంగమ్మ ఆలయంలో బుధవారం గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ పూజారి గురువారం ఉదయం వచ్చేసరికి తలుపులు తెరిచి ఉండడంతో పరిశీలించగా అమ్మవారి మెడలో బంగారు ఆభరణాలు, హుండీలోని నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. ఆభరణాలు, నగదు కలిపి రూ.2.50లక్షల వరకు ఉంటాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం గుర్తింపు

ఖమ్మంక్రైం: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకోగా మూడు రోజుల అనంతరం కుళ్లిపోయిన స్థితిలో ఆయన మృతదేహాన్ని గుర్తించారు. ఈఘటనకు సంబంధించి ఖమ్మం త్రీటౌన్ సీఐ రమేష్ వెల్లడించిన వివరాలు... సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వుకు చెందిన కడారి అప్పారావు(40) ఖమ్మం సుందరయ్యనగర్‌కు చెందిన రేణుకను వివాహం చేసుకుని వ్యవసాయ మార్కెట్‌లో హమాలీగా పనిచేస్తున్నాడు. పత్తి మార్కెట్ వెనక ప్రాంతంలో భార్య ,ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తుండగా అప్పారావు తరచూ మద్యం సేవిస్తుండటంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. పెద్దమనుషులు సర్దిచెప్పినా ఫలితం లేకపోగా మూడు రోజుల క్రితం భార్యతో గొడవపడడంతో ఆమె పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లింది. అయితే, గురువారం ఉదయం ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు రేణుకకు సమాచారం ఇవ్వగా ఆమె వచ్చి చూసేసరికి అప్పారావు మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. మూడు రోజుల క్రితమే ఆయన ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తుండగా, పోలీసులు చేరుకుని అన్నం ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో మృతదేహన్ని మార్చురీకి తరలించారు.

ఉరి వేసుకుని మరో వ్యక్తి ...

కామేపల్లి: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని ఊట్కూర్ గ్రామానికి చెందిన గొర్రెపాటి వాసు(35)కు ఆయన భార్యతో కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన ఆయన గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఆత్మహత్య చేసుకున్నాడు.

పందిళ్లపల్లిలో ఒకరు...

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లికి చెందిన ఉరిమిల రామ్మోహనాచారి(39) అధిక మోతాదులో మాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొద్దిరోజుల క్రితం మతిస్థిమితం కోల్పోయిన ఆయన గాంధీనగర్ కాలనీలోని ఓ మహిళ వద్ద ఉంటున్నాడు. బుధవారం ఆయన ఇంట్లో ఉన్న మాత్రలను అధిక మోతాదులో మింగడంతో అపస్మారక స్థితికి చేరగా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందగా రామ్మోహనాచారి సోదరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

మండాలపాడులో యువకుడు..



రమేష్ (ఫైల్)

పెనుబల్లి: అనారోగ్య సమస్యలతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెనుబల్లి మండలం మండాలపాడు గ్రామానికి చెందిన గుర్రం రమేష్ (27) అనారోగ్య సమస్యలు భరించలేక జీవితంపై విరక్తితో బుధవారం ఉదయం కలుపు మందు తాగాడు. దీంతో కుటుంబీకులు ఆయనను పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు.

72 గ్యాస్ సిలిండర్లు సీజ్

ఖమ్మం సహకారనగర్: హోటళ్లు, ప్రైవేట్ హాస్టళ్లు, టిఫిన్ సెంటర్లలో మూడు రోజులు చేపట్టిన తనిఖీల్లో 72 గృహావసరాల గ్యాస్ సిలిండర్లను సీజ్ చేసినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి కె.చందన్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో డీటీలు, ఆర్ఐలు తనిఖీలు చేపట్టారని పేర్కొన్నారు. ఈసందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న గృహావసరాల సిలిండర్లను సీజ్ చేసి బాధ్యులపై 6ఏ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

అటవీ పార్కులో మహిళ మృతదేహం

ఇటీవల అదృశ్యమైన టేకులపల్లి వాసిగా గుర్తింపు



మృతదేహాన్ని తీసుకొస్తున్న అన్నం ఫౌండేషన్ బాధ్యులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం వెలుగుమట్ల అటవీ పార్కులో కుళ్లిపోయిన స్థితిలో మహిళ మృతదేహాన్ని గురువారం గుర్తించారు. అటవీ పార్క్‌లో బీట్ ఆఫీసర్లు తనిఖీ చేస్తుండగా దుర్వాసన రావడంతో పరిశీలించిన వారు మహిళ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్, ఎస్ఐ సంతోష్ చేరుకుని పరిశీలించారు. టేకులపల్లి కేసీఆర్ టవర్‌కు చెందిన రాజేశ్వరి(34) మతిస్థిమితం కోల్పోగా ఈనెల 7న ఇంటి నుంచి వెళ్లిపోవడంతో కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. దీంతో ఆమె బంధువులను పిలిపించగా రాజేశ్వరి మృతదేహంగా గుర్తించారు. ఈ మేరకు మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు, సభ్యుల సహకారంతో మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అగ్గిపెట్టె లేదన్నందుకు దాడి

కారేపల్లి: అగ్గిపెట్టె లేదని చెప్పినందుకు ఓ వ్యక్తి పై నలుగురు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కారేపల్లి క్రాస్‌రోడ్డుకు చెందిన సిద్దంశెట్టి నాగేశ్వరరావు తన ట్రాక్టర్‌లో డీజిల్ కొట్టించేందుకు బుధవారం రాత్రి సమీపంలోని బంక్‌కు వెళ్లాడు. అక్కడకు ద్విచక్రవాహనాలపై చేరుకున్న ఖమ్మం యువకులు రోహిత్, సాయి, అభి, యశ్వంత్ ఆయనను అగ్గిపెట్టె అడిగారు. తన వద్ద లేదని నాగేశ్వరరావు చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ దాడికి పాల్పడ్డారు. దీంతో తీవ్రగాయాలైన నాగేశ్వరరావు ఫిర్యాదుతో గురువారం నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజారాం తెలిపారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తలు బుల్లెట్లు

కొందరు నేతలు పోయినంత మాత్రాన నష్టమేమీ లేదు

- ఎర్రవల్లిలోని నివాసంలో పార్టీ నాయకులతో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ వ్యాఖ్య
- కార్యకర్తలనే నాయకులుగా తీర్చిదిద్దుకుందాం
- కాంగ్రెస్ మోసాలను ప్రజలంతా గమనిస్తున్నారు
- తిరిగి ఆదరించి, రెట్టింపు మద్దతుతో గద్దెపై కూర్చోబెడతారు
- పార్టీ ప్రస్థానం కొనసాగుతుంది.. భవిష్యత్ బీఆర్‌ఎస్‌దేనని ధీమా



గురువారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో కేసీఆర్. చిత్రంలో కౌశిక్‌రెడ్డి తదితరులు

మర్కూక్ (గజ్వేల్)/ సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్‌కు బుల్లెట్ల వంటి కార్యకర్తలు ఉన్నారని, వారే రేపటి నాయకులని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. కొంతమంది స్వార్థపరులు పోయినంత మాత్రాన బీఆర్‌ఎస్‌కు నష్టమేమీ లేదన్నారు. పార్టీ 25 ఏళ్ల ప్రజాప్రస్థానం కొనసాగుతుందని, భవిష్యత్ బీఆర్‌ఎస్‌దేనని ధీమా వ్యక్తం చేశారు. గురువారం సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో హుజూరాబాద్, ఆర్మూర్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో కేసీఆర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కేసీఆర్ చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే..

''ఆరు దశాబ్దాలపాటు దిక్కూమొక్కూ లేక కొట్టుమిట్టాడిన తెలంగాణను ఓ దరికి చేర్చేందుకు గులాబీ జెండా ఉద్యమ కేతనమై ఎగిరింది. తెలంగాణ సాధన అనే మహోన్నత లక్ష్యాన్ని సాధించేందుకు ఎన్నో పదవులను త్యాగం చేసిన చరిత్ర మనది. తెలంగాణ సాధించిన ఘనత కన్నా నాకు సీఎం పదవి పెద్ద విషయం కాదు.

ప్రజలు మోసపోయారు

ప్రత్యేక రాష్ట్రం సాధించే నాటికి సమైక్య పాలనలో తెలంగాణది దిక్కూమొక్కూ లేని పరిస్థితి. రాష్ట్ర పాలన పగ్గాలు చేపట్టి సాగునీరు, తాగునీరు, కరెంటు వంటి అనేక కీలక వసతులు కల్పించుకున్నాం. అన్ని రంగాల్లో తెలంగాణను తీర్చిదిద్దుకున్నాం. పదేళ్ల స్వల్పకాలంలోనే అద్భుత ప్రగతి సాధించుకున్నాం. ఇటువంటి సమయంలో ప్రజలు ఊహించని తీర్పునిచ్చారు. కొన్ని కొన్ని సార్లు ఇలాంటి తమాషాలు జరుగుతుంటాయని చరిత్రలోకి వెళితే అర్థమవుతుంది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అలవిగాని హామీలను నమ్మి ప్రజలు మోసపోయారు. పాలిచ్చే బర్రెను వదిలి దున్నపోతును తెచ్చుకున్నట్లు అయిందంటూ ఇప్పుడు బాధపడుతున్నారు. బీఆర్‌ఎస్ సర్కారులో అందిన లబ్ధి ఇప్పుడు రావడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఎంతో కష్టపడి దరికి తెచ్చిన తెలంగాణ కాంగ్రెస్ పాలనలో దారి తప్పింది.

పార్టీయే నాయకులను సృష్టిస్తుంది

ఎప్పుడూ పార్టీ నాయకులను సృష్టిస్తుంది. నాయకులు పార్టీలోకి వచ్చిపోతుంటారు. కొందరు నాయకులు వీడినంత మాత్రాన పార్టీకి ఎటువంటి నష్టం రాదు. బీఆర్‌ఎస్ పార్టీకి బుల్లెట్ల వంటి కార్యకర్తలున్నారు. వారినే నాయకులుగా తీర్చిదిద్దుకుందాం. పార్టీ బీఫారం ఇచ్చి అవకాశమిస్తే.. ఎవరైనా సిపాయిలుగా తయారవుతారు. ప్రజల్లో చైతన్యం వచ్చి కాంగ్రెస్ చేసిన మోసాన్ని గుర్తిస్తారు. తిరిగి బీఆర్‌ఎస్‌ను ఆదరిస్తారు. అప్పటిదాకా ఓపికతో ప్రజాసమస్యలపై దృష్టి సారించాలి..''అని కేసీఆర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ప్రశాంత్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, కందాల ఉపేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు జహంగీర్, దుండిగల రాజేందర్, చైర్మన్లు, సర్పంచులు, ఇతర నేతలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌ను మించి ప్రజలు మనకు మద్దతిస్తారు

తెలంగాణ కోసం సాగిన మన 25 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం ఆగలేదు, అయిపోలేదు. ఒకసారి ఓడగొట్టిన ఎన్టీఆర్‌ను తిరిగి ఎలాగైతే ప్రజలు గద్దె మీద కూర్చోబెట్టారో అంతకన్నా గొప్పగా బీఆర్‌ఎస్ పార్టీని ప్రజలు తిరిగి ఆదరిస్తారు. అంతకంటే రెట్టింపు మద్దతుతో మనను గద్దె మీద కూర్చుండబెట్టే రోజు త్వరలోనే వస్తుంది. కాంగ్రెస్ పాలన రోజురోజుకూ దిగజారుతోంది.

స్టీరింగ్ పట్టిన కేసీఆర్

ఫామ్‌హౌజ్‌లో మినీ వ్యాన్ నడిపిన బీఆర్‌ఎస్ అధినేత

మర్కూక్ (గజ్వేల్): బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ స్టీరింగ్ పట్టారు. గురువారం సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో కాసేపు మినీ వ్యాన్ నడిపారు. అందులో ఎమ్మెల్యేలు, నేతలను కూర్చోబెట్టుకుని ఫామ్‌హౌజ్‌లో కలియదిరిగారు. కొన్నినెలల క్రితం కేసీఆర్‌కు తుంటి ఎముక విరగడంతో, శస్త్రచికిత్స చేయించుకున్న విషయం తెలిసిందే. తర్వాత చాలా రోజులు చేతికర్ర సాయంతో నడిచిన ఆయన.. ఇటీవలే వైద్యుల సూచన మేరకు చేతికర్ర వదిలేసి నడవడం మొదలుపెట్టారు. తాజాగా తన ఫామ్‌హౌజ్‌లో ఓమ్నీ వ్యాన్ నడుపుతూ కనిపించారు. వ్యాన్‌లో కేసీఆర్‌తోపాటు ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.

కవితా సంకలనాన్ని అందజేసిన కవయిత్రి మహెజబీన్ బేగ్

ప్రముఖ స్త్రీవాద కవయిత్రి మహెజబీన్ బేగ్ గురువారం ఎర్రవల్లిలో కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా తన కవితా సంకలనం ం 'ఆకులురాలు కాలం'ంపుస్తకాన్ని కేసీఆర్‌కు అందజేశారు.

ఎమ్మెల్యేల పార్టీ మార్పు పిటిషన్..

3 నెలల్లో నిర్ణయం తీసుకోవాలి

ఇప్పటివరకు స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు

- ఈ మేరకు గతంలో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది
- వెంటనే నిర్ణయం తీసుకునేలా ఆదేశించాలి
- పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది వాదనలు

సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు ప్రకారం ఎమ్మెల్యే పార్టీ మార్పు అంశంపై స్పీకర్ 3 నెలల్లో నిర్ణయం తీసుకోవాలని.. ఆ గడువు దాటి వారమైనా ఇంకా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని పిటిషనర్ల (బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద్) తరఫున సీనియర్ న్యాయవాది ఆర్యామ సుందరం వాదనలు వినిపించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేకు కనీసం ఇప్పటివరకు నోటీసులు కూడా జారీ చేయలేదన్నారు. వెంటనే నిర్ణయం తీసుకునేలా స్పీకర్‌ను ఆదేశించాలని కోరారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావులను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'వీరు 2023 నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున విజయం సాధించి, తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. ఒక పార్టీ అభ్యర్థిత్వంపై గెలిచి శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేయకుండా మరో పార్టీలో చేరిన వీరిని అనర్హులుగా ప్రకటించాలి. స్పీకర్‌ను కలవాలని ప్రయత్నించినా సమయం ఇవ్వడం లేదు. ఈ మెయిల్ ద్వారా పంపిన పిటిషన్‌పై 3 నెలల్లోగా నిర్ణయం తీసుకునేలా స్పీకర్ ఆదేశించాలి'అని కోరారు. ఇదే విధంగా ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసి విజయం సాధించిన దానం నాగేందర్.. ఎమ్మెల్యే సభ్యత్వానికి రాజీనామా చేయకుండా కాంగ్రెస్‌లో చేరారని, ఆయనను కూడా అనర్హుడిగా ప్రకటించాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మరో పిటిషన్ వేశారు. ఈ రెండు పిటిషన్లపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి గురువారం మరోసారి విచారణ చేపట్టారు.

రెండు తీర్పులను పరిశీలిస్తే..

సీనియర్ న్యాయవాది ఆర్యామ సుందరం వాదనలు వినిపిస్తూ.. 'ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి పార్టీ మారడమే కాకుండా పార్లమెంట్ ఎన్నికల్లోనూ పోటీ చేశారు. ఆయనను ప్రజలు ఓడించారు. మార్చి 18న పిటిషన్ ఇచ్చినా స్పీకర్ కార్యాలయం ఇంత వరకు ఏం చర్యలు చేపట్టిందో కూడా చెప్పలేదు. ఈ రోజు విచారణ ఉండగా, ఒక రోజు ముందు కౌంటర్ దాఖలు చేశారు. మహారాష్ట్ర, మణిపూర్ కేసులలో సుప్రీంకోర్టు వెలువరించిన రెండు తీర్పులను పరిశీలిస్తే.. తమ ముందు పెండింగ్‌లో ఉన్న అనర్హత పిటిషన్లపై నిర్దీత గడువులోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. రూల్ 6, 7 ప్రకారం స్పీకర్ నడుచుకోవడం లేదు. వెంటనే నిర్ణయం తీసుకునేలా స్పీకర్‌ను ఆదేశించాలి'అని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రతివాదుల వాదన కోసం తదుపరి విచారణను జూలై 3కు వాయిదా వేసింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్‌రెడ్డి, అనధికారిక ప్రతివాది తరఫున సీనియర్ న్యాయవాది మయూర్‌రెడ్డి హాజరయ్యారు.

సీతారామ పంప్‌హౌస్ ట్రయల్ రన్ సక్సెస్



భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులోని పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోస్తున్న గోదావరి నీరు

అశ్వాపురం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు గ్రామంలో నిర్మించిన సీతారామ ప్రాజెక్ట్ ఫేస్–1 పంప్‌హౌస్ ట్రయల్‌రన్ గురువారం విజయవంతమైంది. పంప్‌హౌస్‌లోని ఒక మోటార్ ద్వారా నీటిని ఎత్తిపోయగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ పంప్‌హౌస్‌లో ఒక్కొక్కటి 25 మెగావాట్ల సామర్థ్యం గల ఆరు మోటార్లు ఏర్పాటు చేశారు. దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి ఒక్కో మోటారు 1,500 క్యూసెక్కుల చొప్పున 9,000 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయనున్నాయి. పంప్‌హౌస్ నిర్మాణం మూడేళ్ల క్రితమే పూర్తయినా.. విద్యుత్ బిల్లులు భారమవుతాయనే ఉద్దేశంతో ఇంతవరకు ట్రయల్ రన్ చేపట్టలేదు. విద్యుత్ కనెక్షన్ కూడా ఇవ్వలేదు. ఇటీవల డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు పంప్‌హౌస్‌ను సందర్శించి విద్యుత్ కనెక్షన్ ప్రారంభించారు. దీంతో పది రోజులుగా ట్రయల్ రన్ పనులు చేపట్టిన అధికారులు.. గురువారం ఆ ప్రక్రియను పూర్తి చేశారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ సలహాదారు పెంటారెడ్డి, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, సీఈ శ్రీనివాసరెడ్డి, ఎస్ఈ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల కొనుగోళ్లను నిలిపివేయాలి

- రాష్ట్రంలో కాంగ్రెస్, మహారాష్ట్రలో బీజేపీ కొనుగోళ్లను ప్రోత్సహిస్తున్నాయి
- బీఆర్‌ఎస్ ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, కేఆర్ సురేశ్‌రెడ్డి, పార్థసారథి విమర్శ



మీడియాతో మాట్లాడుతున్న వద్దిరాజు రవిచంద్ర. చిత్రంలో పార్థసారథి, సురేశ్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ, మహారాష్ట్రలో బీజేపీ ఎమ్మెల్యేల కొనుగోళ్లను ప్రోత్సహిస్తున్నాయని బీఆర్‌ఎస్ ఎంపీలు ఆరోపించారు. ఇదేనా ప్రజాస్వామ్యం అంటూ ఆ రెండు పార్టీలను నిలదీశారు. రాష్ట్రంలో తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యేల కొనుగోళ్లను కాంగ్రెస్ నిలిపివేయాలని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఎంపీలు కె.ఆర్.సురేశ్‌రెడ్డి, డాక్టర్ బండి పార్థసారథిలతో కలసి వద్దిరాజు రవిచంద్ర మీడియాతో మాట్లాడారు. తమ పార్టీ గుర్తుపై గెలిచిన వారిని కాంగ్రెస్ లాక్కోవడం అప్రజాస్వామికమని విమర్శించారు. ఇటువంటి పద్ధతులకు స్వస్తి చెప్పి ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టిసారించాలని సూచించారు. రాష్ట్రానికి సింగరేణి బంగారం లాంటిదని, సింగరేణిని ప్రైవేటుపరం కానివ్వకుండా తమ పార్టీ అడ్డుకుంటుందని తెలిపారు. పాలమూరు–రంగారెడ్డి సాగునీటి పథకానికి జాతీయహోదా ఇవ్వాలని, ఖాజీపేటలో రైల్వే కోచ్‌ను ఏర్పాటు చేయాలని ఎంపీలు డిమాండ్ చేశారు. బయ్యారంలో ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పాలని, దీనికోసం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చొరవ చూపాలని సూచించారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం ద్వారా ప్రాంతీయ పార్టీలను అణగదొక్కేందుకు బీజేపీ, కాంగ్రెస్‌లు కుట్ర పన్నుతున్నాయని కె.ఆర్.సురేశ్‌రెడ్డి మండిపడ్డారు. దేశంలో తెలంగాణ రాష్ట్రం పదేళ్ల పాటు అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిచిందని, అయితే కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సినవి మాత్రం ఇవ్వలేదని విమర్శించారు. త్వరలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో రైతులు, మహిళలు, నిరుద్యోగులకు అధిక ప్రాధాన్యతను ఇస్తారని ఆశిస్తున్నట్లు సురేశ్‌రెడ్డి తెలిపారు.

ఫిరాయింపుల్ని ప్రోత్సహించిందే బీఆర్‌ఎస్: గజ్జెల కాంతం

సాక్షి, హైదరాబాద్: ఫిరాయింపులను ప్రోత్సహించిందే బీఆర్‌ఎస్ పార్టీ అని, కేసీఆర్ కేబినెట్‌లోకి మొత్తం టీడీపీ ఎమ్మెల్యేలను తీసుకోలేదా? అని టీపీసీసీ నేత గజ్జెల కాంతం ప్రశ్నించారు. ఆయన గురువారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులకు లేదన్నారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డిలు కాంగ్రెస్ నుంచి వెళ్లినవారు కాదా?, కాంగ్రెస్ నుండి మొత్తం ఎమ్మెల్యేలను తీసుకునేటప్పుడు ఫిరాయింపులు గుర్తుకు రాలేదా? అని నిలదీశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి.. భట్టి విక్రమార్కను ప్రతిపక్ష హోదా నుంచి దింపేయలేదా? అని ప్రశ్నించారు.

జిల్లా వార్తలు

వచ్చేనెల 4న ఎన్‌డీ పార్టీల కలయిక



సమావేశంలో మాట్లాడుతున్న గోవర్ధన్

ఖమ్మంమయూరిసెంటర్: న్యూడెమోక్రసీ పార్టీలో చీలికలను వ్యతిరేకిస్తూ.. రెండు వర్గాలు తిరిగి కలవనున్నాయని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, కె.గోవర్ధన్ తెలిపారు. ఖమ్మంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో భూమి లేని పేదల కోసం నాటి సాయుధ పోరాటం స్ఫూర్తితో మరో ఉద్యమం చేయాల్సిన అవసరముందని చెప్పారు. భూస్వాముల దోపిడీపై 1946 నుండి 1952 వరకు జరిగిన తెలంగాణ సాయుధ పోరాటం మహత్తరమైనదన్నారు. నాటి ఉద్యమ స్ఫూర్తితో జూలై 4న దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా రెండు న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యాన రాష్ట్ర స్థాయి సదస్సు ఖమ్మంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇదే సదస్సులో న్యూడెమోక్రసీ పేరుతో కొనసాగుతున్న రెండు పార్టీలు కలవనున్నాయని వెల్లడించారు. నాయకులు గౌని ఐలయ్య, పరకాల నాగయ్య, ఎం.శ్రీనివాస్, డేవిడ్‌కుమార్, రాజేంద్రప్రసాద్, గిరి, ఖాసీం, కె.సురేష్, కె.లక్ష్మీనారాయణ, ఏ.నిర్మల, జానకి, ప్రకాశ్, కల్పన పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

బోనకల్: ప్రభుత్వం వెంటనే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత ఫించన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. బోనకల్ మండలంలోని పలు పాఠశాలలను నుంచి గురువారం సందర్శించిన ఆయన మాట్లాడారు. పదోన్నతుల అనంతరం ఏర్పడిన ఉపాధ్యాయ ఖాళీలను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయాలని, పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం బేసిక్ అమలుచేయడమే కాక పెండింగ్ డీఏలు విడుదల చేయాలని కోరారు. కాగా, ప్రభుత్వ విద్యారంగం బలోపేతమయ్యేలా ఉపాధ్యాయులతో పాటు సమాజం కూడా బాధ్యత వహించాలన్నారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావుతో పాటు చావా దుర్గాభవాని, రమాదేవి, వల్లకొండ రాంబాబు, సదాబాబు, కాప్రా, ఎస్.వీరబాబు, బి.ప్రీతం, గుగులోతు రామకష్ణ, లెవిన్‌స్టన్, శివకృష్ణ, పి.గోపాలరావు, పి.నర్సింహారావు, లక్ష్మి, శ్రీరామారావు, జి.శ్రీనివాసరావు, నాగేందర్, మురళి, నాగమహేష్, శ్రీనివాసరావు కె.లక్ష్మణరావు నరసింహారావు, సురేష్ పాల్గొన్నారు.

మ్యాన్‌రైడింగ్‌తో తగ్గిన దూరాభారం

- రూ.9.2 కోట్ల వ్యయంతో పీవీకే–5 ఇంక్లైన్‌లో ఏర్పాటు
- 1.5కి.మీ. నిడివితో ఏర్పాటు.. కార్మికులకు తగ్గిన శ్రమ
- ఫలితంగా పెరుగుతున్న హాజరు, ఉత్పత్తి





మ్యాన్ రైడింగ్‌ను ప్రారంభిస్తున్న సింగరేణి సీఎండీ బలరామ్, డైరెక్టర్లు (ఇన్‌సెట్) మ్యాన్‌రైడింగ్ ద్వారా పనిప్రదేశానికి వెళ్తున్న ఉద్యోగి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులు పక్రతికి విరుద్ధంగా భూగర్భగనుల్లో సుమారు 600 అడుగుల లోతుల్లో పనిచేయాల్సి ఉంటుంది. గని పైభాగం నుండి 500 అడుగుల మేరకు వారు కేజ్ (లిఫ్ట్) ద్వారా గనిలోకి దిగుతారు. అక్కడినుండి మళ్లీ మూడు కి.మీ. మేర కాలినడకన పని ప్రదేశానికి చేరుకోవాలి. ఈ మార్గంలో బురద, రాళ్లతోపాటు ర్యాంప్ మాదిరి ఉండడం.. పైనుండి నీరు కారుతుండడంతో శ్రమించాల్సి వస్తుంది. కొత్తగూడెం ఏరియాలోని పరిధిలోని పీవీకే–5 ఇంక్లైన్‌లోనూ ఇదే పరిస్థితి ఉండడంతో కార్మికులు, సంఘాల నాయకుల వినతితో ఇటీవల అధికారులు రూ.9.2 కోట్ల వ్యయంతో 2కి.మీ. 1.5 కి.మీ. మేర మ్యాన్ రైడింగ్ ఏర్పాటుచేశారు. దీనిని ఈనెల 5న సింగరేణి సీఎండీ బలరామ్, ఇతర డైరెక్టర్లతో కలిసి ప్రారంభించారు. తద్వారా తీగ ఆధారంగా రాడ్‌పై కూర్చుని నేరుగా పని ప్రదేశానికి చేరుకునే వెసలుబాటు లభించడంతో కార్మికుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. మరో పక్క నడిచి వెళ్లాల్సి రావడంతో తక్కువగా నమోదవుతున్న హాజరుశాతం పెరగడంతో ఉత్పత్తి కూడా పెరుగుతోందని అధికారులు చెబుతున్నారు.

ఇబ్బందిగా ఉండేది..



ఇన్నాళ్లు కార్మికులకు యాజమాన్యం కేటాయించిన ఎనిమిది గంటల సమయంలో సుమారు రెండు గంటలు కాలి నడకకే పోయేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మ్యాన్ రైడింగ్ ఏర్పాటుతో ఇబ్బందులు తీరాయి. వచ్చివెళ్లేందుకు మ్యాన్ రైడింగ్ ఉండడంతో ఉత్సాహంతో పనిచేస్తున్నారు.

– హ్యుమాయిన్, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ

ఉత్సాహంగా పనిచేస్తున్నాం..



మ్యాన్ రైడింగ్ ఏర్పాటుకు ఉన్న ఇబ్బందులు తొలగి ఉత్సాహంగా పనిచేస్తున్నాం. గతంలో 700 టన్నులు ఉన్న ఉత్పత్తి 800 టన్నులకు పెరిగింది. యాజమాన్యం ఇంకో కి.మీ. కూడా మ్యాన్ రైడింగ్ పెంచితే ఊరటగా ఉంటుంది. దీంతోపాటు వెంటిలేషన్ కూడా మెరుగుపర్చాలి.

– ధర్మారావు, పీవీకే–5 ఇంక్లైన్ కార్మికుడు

హాజరు శాతం పెరుగుతోంది..



గనిలో 670 మంది కార్మికులకు గతంలో 400 మందే వచ్చేవారు. మ్యాన్ రైడింగ్ ఏర్పాటయ్యాక ఈ సంఖ్య 550కి చేరింది. తద్వారా ఉన్న వారిపై భారం తగ్గినట్లయింది. మరోమారు ఫ్యామిలీలతో కౌన్సెలింగ్ ఇప్పిస్తే ఇంకొందరు కూడా విధులకు హాజరయ్యే అవకాశం ఉంది.

– పాలడుగు శ్రీనివాస్, గని మేనేజర్

శివయ్యా... నీ దర్శన భాగ్యమెన్నడు?

- పెద్దమ్మ గుడి వద్ద రెండున్నరేళ్లుగా ఆలయ నిర్మాణం
- రూ.74లక్షలు కేటాయించిన పూర్తికాని పనులు



పెద్దమ్మగుడి సమీపాన నిర్మాణంలో ఉన్న శివాలయం

పాల్వంచరూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం కేశవాపురం–జగన్నాధపురం గ్రామాల మధ్య పెద్దమ్మతల్లి ఆలయ సముదాయంలో నిర్మిస్తున్న శివాలయం నిర్మాణ పనులు ఓ కొలిక్కి రావడం లేదు. గతేడాది మహాశివరాత్రికే ఆలయాన్ని ప్రారంభిస్తామని దేవాదాయ శాఖ అధికారులు చెప్పినా మళ్లీ శివరాత్రి వస్తున్నా ప్రారంభించకుండా జాప్యం చేయడంపై భక్తులు మండిపడుతున్నారు. ఓ దాత సమకూర్చిన రూ.30లక్షలకు తోడు ఆలయ నిధులు రూ.44లక్షలు కలిపి రూ.74 లక్షలతో ఆలయ నిర్మాణ పనులను 2021 అక్టోబర్‌లో ప్రారంభించారు. అయితే, పనులు పూర్తికాకున్నా 2023 కార్తీకమాసంలో ప్రారంభించాలని నిర్ణయించినా మంచి ముహూర్తాలు లేక ఆగిపోయింది. అనంతరం శివరాత్రి రోజు ప్రారంభించాలని ముహూర్తం కోసం అప్పటి ఆలయ కమిటీ ఆధ్వర్యాన జగన్నాధపురం, కేశవాపురం గ్రామాల ప్రజలతో సమావేశమైతే అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో ఆలయ ప్రారంభోత్సవం నిలిచిపోగా... ప్రస్తుతం కమిటీ లేకపోగా ఆలయాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి.

ఇంకా పనులు పెండింగ్

ఆలయ నిర్మాణం పూర్తయినందని చెబుతున్నా ఇంకా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. తలుపులు బిగించాల్సి ఉండగా.. విద్యుత్ వైరింగ్ చేసి రంగులు వేయించాల్సి ఉంది. కానీ మండల పరిధిలో శివాలయాన్ని త్వరగా ప్రారంభిస్తే దూరం వెళ్లాల్సి బాధ తప్పుతుందని భక్తులు కోరుతున్నారు. ఈవిషయమై పెద్దమ్మతల్లి ఆలయ ఈఓ రజినికుమారిని వివరణ కోరగా పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించినట్లుతెలిపారు. అలాగే, శివ పార్వతులు, గణపతి విగ్రహాలను మహాబలిపురం నుంచి తెప్పిస్తున్నట్లు చెప్పారు. అనుకున్న విధంగా పనులు పూర్తయితే కార్తీకమాసంలో భక్తులు పూజలు జరిపే అవకాశం లభిస్తుందని తెలిపారు.

'పద్మశ్రీ' రామచంద్రయ్య కుటుంబాన్ని ఆదుకుంటాం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా



రామచంద్రయ్య కుటుంబీకులతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి



రాములమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు

మణుగూరు టౌన్: కంచుతాళం, కంచుమేళం డోలు వాయిద్యకారుడు పద్మశ్రీ సకిని రామచంద్రయ్య మరణం ఆదివాసీ సమాజానికి తీరని లోటని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కూనవరానికి చెందిన రామచంద్రయ్య నివాసంలో ఆయన చిత్రపటం వద్ద మంత్రి, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలు గర్వించదగిన వ్యక్తి రామచంద్రయ్య అని తెలిపారు. ఆయన అనారోగ్యంతో ఉన్నప్పుడు రూ.50వేల ఆర్థిక సాయం అందించానని, ఎమ్మెల్యే సూచనలతో దహన సంస్కారాల నిమిత్తం ట్రైబల్ అసోసియేషన్ ఆధ్వర్యాన రూ.20వేలు అందించారని చెప్పారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఇంటి స్థలం, కళాకారుల పెన్షన్ రూ.25వేలను రామచంద్రయ్య భార్య బాపనమ్మకు అందించడమే కాక ఆయన కుమారుడు బాబురావుకు ఉద్యోగం కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే, రామచంద్రయ్య కుటుంబాన్ని మంత్రి సీతక్క కూడా పరామర్శించి రూ.25వేల ఆర్థికసాయం అందజేశారు. కాగా, ఇటీవల మృతి చెందిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తల్లి రాములమ్మ దశదిన కర్మ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి, సీతక్క పాల్గొన్నారు. అలాగే, రోడ్డు ప్రమాదంలో గాయపడిన సింగరేణి రిటైర్డ్ కార్మిక నేత నామా వెంకటేశ్వర్లును పరామర్శించారు. ఈకార్యక్రమాల్లో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, జారె ఆదినారాయణ, కూనంనేని సాంబశివరావు, రాందాస్ నాయక్, ఎంపీపీ ముత్తినేని సుజాత, నాయకులు, ప్రజాప్రతినిధులు మువ్వా విజయ్‌బాబు, తుళ్లూరు బ్రహ్మయ్య, బానోత్ విజయబాయి, బాలసాని లక్ష్మీనారాయణ, నాగ సీతారాములు, ఎడవల్లి కృష్ణ, చందా సంతోష్, దేవీప్రసన్న, సాబీర్ పాషా, బొల్లోజు అయోధ్యాచారి, చందా లింగయ్యదొర, గుడిపూడి కోటేశ్వరరావు, సామా శ్రీనివాసరెడ్డి, పుచ్చకాయల శంకర్, కే.వీ.రావు, పీరినాకీ నవీన్, శివ సైదులు, సామా శ్రీనివాసరెడ్డి, గణేశ్‌రెడ్డి, సుబ్బారెడ్డి, కొర్సా ఆనంద్, పుచ్చకాయల శంకర్, గాండ్ల సురేశ్, వరలక్ష్మి, కనకలక్ష్మి, గోరంట్ల కనకనయ్య తదితరులు పాల్గొన్నారు.

జేకే ఓసీలో పర్యటించిన డైరెక్టర్



ఓసీలో పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, అధికారులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలోని జేకే ఓసీని డైరెక్టర్(ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) జి.వెంకటేశ్వరరెడ్డి గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా రోజు వారీ బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబీ బ్లాస్టింగ్, లోడింగ్ పనులపై జీఎం జాన్ ఆనంద్‌తో ఆరా తీశారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ రోజు వారీ లక్ష్యాల మేరకు బొగ్గు ఉత్పత్తి, రవాణా చేపట్టాలని, వర్షాకాలంలో ఆటంకం లేకుండా చూడాలని సూచించారు. ప్రాజెక్టు ఆఫీసర్ బి.వెంకటేశ్వర్లు, అధికారులు పూర్ణచందర్, చిన్నయ్య, శివప్రసాద్, నాగరమేష్, శ్రీనివాస్, నాగేశ్వరరావు, మహేష్ తదితరులు ఉన్నారు.

నూతన ఓసీ కోసం పరిశీలన

సింగరేణి ఇల్లెందు ఏరియాలో నూతన ఓసీ ఏర్పాటుకు సంబంధించి అధికారులు భూపరిశీలన చేపట్టారు. గతంలో మూతబడిన జేకే–2 ఏరియాలో కొత్త ఓసీ ఏర్పాటుకు నిర్ణయించారు. ఇక్కడ సింగరేణికి సమకూర్చాల్సిన స్థలానికి బదులు అటవీశాఖ అధికారులకు అప్పగించే స్థలాన్ని అటవీశాఖ అధికారులు మంజుల, హరిప్రసాద్, వీఆర్‌ఓ అయేషా, సింగరేణి ఎస్‌ఓటుజీఎం మల్లారపు మల్లయ్య, సర్వేయర్ మంగీలాల్ పరిశీలించారు.